సాక్షి
బాపట్ల
మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

రేపల్లెరూరల్: రేపల్లె మండలం ఉప్పూడి పంచాయతీ ఊలుపాలెంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని సోమవారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆవిష్కరించారు.



తెనాలి జిల్లా వైద్యశాల పరిశీలన

తెనాలి అర్బన్: ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్(ఐపీహెచ్ఎస్)కు చెందిన న్యూఢిల్లీ వైద్య బృందం తెనాలి జిల్లా వైద్యశాలలో సోమవారం మధ్యాహ్నం పరిశీలించింది.



1,11,605 బస్తాలు రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,11,605 మిర్చి బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి 1,07,640 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎస్పీఎల్ సెంట్రల్ ఆంధ్రా రీజియన్ మ్యాచ్‌లు

విజయవాడ స్పోర్ట్స్: 'సాక్షి ప్రీమియర్ లీగ్'(ఎస్పీఎల్) సెంట్రల్ ఆంధ్రా రీజియన్ జూనియర్, సీనియర్ పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ క్రికెట్ మైదానంలో మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలి రోజు జరిగే మ్యాచ్‌లను విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్.రఘునాథన్ ఉదయం ఎనిమిది గంటలకు టాస్ వేసి ప్రారంభిస్తారు. రెండు రోజులు జరిగే ఈ మ్యాచ్‌లలో ఉమ్మడి నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల జూనియర్, సీనియర్ జట్లు తలపడతాయి. సీనియర్స్ విభాగంలో గుంటూరు (ఎస్‌కేఆర్‌బీఆర్ కాలేజీ) – కృష్ణా(నలంద డిగ్రీ కాలే జీ), పశ్చిమగోదావరి (సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ) – ఒంగోలు (పేస్ ఇంజినీరింగ్ కాలేజీ), జూనియర్స్ విభాగంలో గుంటూరు (కల్లం హరినాథరెడ్డి కాలేజీ) – ఒంగోలు (పేస్ డిప్లొమా కాలేజీ), కృష్ణా(ఎస్ఆర్ఐ జూనియర్ కాలేజీ) – నెల్లూరు(వివేకానంద జూనియర్ కాలేజీ) జట్లు నాకౌట్ పద్ధతిలో మంగళవారం తలపడతాయి. బుధవారం జరిగే ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన జట్లు 23వ తేదీ నుంచి ఇదే మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్పీఎల్ పోటీలకు సెంట్రల్ ఆంధ్ర రీజియన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయి.

కోటప్పకొండలో 'భజరంగ్' సేవ



నరసరావుపేట: పల్నాడు జిల్లా కోటప్పకొండలో భజరంగ్ ఫౌండేషన్ ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించింది. ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ, సభ్యులు 100మంది కార్యక్రమంలో పాల్గొని వ్యర్థాలను తొలగించారు.

సజావుగా ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు సోమవారం ప్రయోగ పరీక్షలు(ప్రాక్టికల్స్) ప్రారంభమయ్యాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. గుంటూరు జిల్లా పరిధిలో 11 కేంద్రాలతో పాటు పల్నాడులో ఒక కేంద్రంలో నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు ప్రథమ సంవత్సర 762, ద్వితీయ సంవత్సరం 590 మంది చొప్పున హాజరయ్యారు. పరీక్షలకు దరఖాస్తు చేసిన 1,501 మంది విద్యార్థుల్లో 149 మంది గైర్హాజరయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల, ఫిరంగిపురం కేంద్రాలను ఆర్ఐఓ జి.సునీత సందర్శించారు. అదే విధంగా ఆర్జేడీ వీవీ సుబ్బారావు రెండు కేంద్రాలను తనిఖీ చేశారు. డీవీఈఓ పద్మ తెనాలిలో ప్రాక్టికల్స్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇంటర్ ప్రాక్టికల్స్‌లో భాగంగా ద్వితీయ సంవత్సర సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఈనెల 26 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు.

దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లు పరిశీలన



నగరంపాలెం: సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ సోమవారం పరిశీలించారు. పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించి, ఆయా రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కట్టుదిట్టమైన భద్రత చర్యలపై ఆయన మాట్లాడారు. పరుగు పందెం, ఇతరత్రా పోటీల నిర్వహణపై చర్చించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీ చంద్రశేఖర్‌రావు, ఎస్‌బీ సీఐ శ్రీనివాస్‌రావు, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు ఉన్నారు.

కోటప్పకొండ ఆర్టీసీ ఆదాయం రూ.76లక్షలు

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా తిరునాళ్లకోసం నరసరావుపేట నుంచి కోటప్పకొండకు భక్తులను తీసుకెళ్లేందుకు నడిపిన బస్సుల కారణంగా రూ.76లక్షల ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి సోమవారం వెల్లడించారు. గతేడాది కంటే రూ.13లక్షల అధికంగా రెవెన్యూ చేకూరిందన్నారు.

విధేయతకు పట్టం

ఎమ్మెల్సీలుగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం

- కొత్తగా మర్రి రాజశేఖర్, ఏసురత్నం
- పోతుల సునీత కొనసాగింపు...
- మూడు పదవుల్లో రెండు బీసీలకే...
- గుంటూరు, పల్నాడు, బాపట్లకు దక్కిన వరాలు
- అన్నీ ఎమ్మెల్యే కోటాలోనే...

సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యం అని మరోమారు నిరూపితమైంది. ఇప్పటికే మంత్రిమండలితో పాటు స్థానిక సంస్థల పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అగ్రస్థానం కల్పించిన సీఎం నేడు ప్రకటించిన ఎమ్మెల్సీ స్థానాల్లో సైతం బలహీన వర్గాలవారికి అధికసంఖ్యలో సీట్లు కేటాయించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు మూడు ఎమ్మెల్సీలు దక్కగా మూడింట రెండింటిని బీసీ వర్గాలకు కేటాయించి, సామాజిక న్యాయాన్ని చాటిచెప్పారు.



పెదకాకాని వై జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న చంద్రగిరి ఏసురత్నం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మరోసారి సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఒక్కో సీటు కేటాయించారు. ఎమ్మెల్యే కోటా కింద ఎంపిక అయ్యే ఎమ్మెల్సీలలో ఏడుగురికి అవకాశం ఉంటే అందులో ముగ్గురు ఈ జిల్లాల వారికే కేటాయించడం గమనార్హం. మొత్తం ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తే అందులో ఇద్దరు బీసీ వర్గాలకు చెందినవారు. ఇద్దరికి కొత్తగా పదవులు కేటాయిస్తే ఒకరికి మరోసారి అవకాశం కల్పించారు. గుంటూరు జిల్లా నుంచి మాజీ పోలీసు అధికారి, గుంటూరు మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, పల్నాడు నుంచి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు, కృష్ణాజిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త మర్రి రాజశేఖర్, బాపట్ల నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పోతుల సునీతకు అవకాశం దక్కింది.

మరోమారు అవకాశం..

ప్రస్తుత ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పోతుల సునీతకు మూడోసారి అవకాశం దక్కింది. బీసీ (పద్మశాలి) సామాజికవర్గానికి చెందిన పోతుల సునీత బాపట్ల జిల్లా చీరాలలో నివాసం ఉంటున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికైన సునీతకు 2021 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా స్థానం కల్పించారు. ప్రస్తుతం 2023 మార్చితో ఎమ్మెల్సీ గడువు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా నుంచి ఆమెకు ఎమ్మెల్సీ కేటాయించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన సునీత డిగ్రీ వరకూ చదువుకున్నారు.



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోతుల సునీత

సామాజిక న్యాయం..



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఏసురత్నం

ప్రస్తుత మిర్చియార్డ్ చైర్మన్‌గా కొనసాగుతున్న చంద్రగిరి ఏసురత్నంకు ఎమ్మెల్సీ వరించింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసిన ఆయన స్వల్ప తేడాతో ఓటమి పొందారు. అనంతరం ఆయనకు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా రెండు దఫాలు అవకాశం కల్పించారు. 1959లో పుట్టిన ఆయన గురజాలలో పాఠశాల విద్య అభ్యసించిన తర్వాత ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీ గుంటూరులో బీఏ వరకూ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పోస్టుగాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1982లో ఎస్ఐగా కర్నూల్ జిల్లాలో చేరారు. అనంతరం అప్పటి ముఖ్యమంత్రులకు సెక్యూరిటీ అధికారిగా, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీఎస్పీగా, అదనపు ఎస్పీ, ఎస్పీగా బాధ్యతలు నిర్వహించి డీఐజీగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో రాణించారు. 2018లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని వైఎస్సార్ సీపీలో చేరారు.

ఇచ్చిన మాట ప్రకారం..



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మర్రి రాజశేఖర్

మర్రి రాజశేఖర్‌కు గత ఎన్నికల సమయంలోనే ఎమ్మెల్సీ ఇస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మర్రి రాజశేఖర్ గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు నియోజవర్గం తిక్కిరెడ్డిపాలెం గ్రామంలో 1957లో జన్మించారు. హైస్కూల్ వరకు ప్రత్తిపాడులో, ఆ తదుపరి పెదనందిపాడు కళాశాలలో కామర్స్‌లో డిగ్రీ, గుంటూరు ఏసీ కళాశాలలో లా పూర్తి చేశారు. లా పూర్తి అయిన తరువాత చిలకలూరిపేటలో ప్రాక్టీస్ ప్రారంభించి 2003 వరకు న్యాయవాద వృత్తిలో కొనసాగారు. 1983 సంవత్సరంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా వ్యవహరించిన తన మేనమామ సోమేపల్లి సాంబయ్య మృతి అనంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. 2004 సాధారణ ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఓటమి చవిచూశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి 2019 ముందు కాలం వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పని చేశారు. 2019కు ముందు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రస్తుతం పార్టీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజియనల్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సమన్వయకర్త మర్రి రాజశేఖర్ అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనా విధానాలకు అనుగుణంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వైఎస్సార్ సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులను ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం బాలినేని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మార్చి 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అందుకోసం మొట్టమొదటి సారిగా వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను పోటీలో నిలిపిందన్నారు. అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే అటు ఉపాధ్యాయుల సమస్యలను, ఇటు పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రుల ఓట్ల నమోదు భారీ స్థాయిలో చేపట్టామన్నారు. దాదాపు 3 లక్షలకు పైగా పట్టభద్రుల పేర్లను ఓటర్లుగా నమోదు చేశారని చెప్పారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోటీచేసే అవకాశం కల్పించి ప్రోత్సహించారన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పేదల ఇళ్లలో విద్యా కుసుమాలను వెలికి తీయాలన్నదే లక్ష్యంగా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు అందరూ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డిలతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలపై బాలినేని సమీక్ష నిర్వహించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబు, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, అద్దంకి ఇన్‌చార్జ్ బాచిన కృష్ణ చైతన్య, చీరాల ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, కొండపి ఇన్‌చార్జ్ వరికూటి అశోక్ బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

గడువులోగా సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు
- స్పందనకు 100 అర్జీలు

బాపట్ల అర్బన్: జిల్లాలో స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి 100 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పందన కార్యక్రమంలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతి, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ విలీమ్స్, డీఎం శ్రీలక్ష్మీ, డీఎంహెచ్ఓ విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు ఆలకిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు

సెల్‌ఫోన్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోండి

బాపట్ల మండలం తూర్పు బాపట్ల పంచాయతీలో నందిరాజ్ తోట పిన్ని బోయినవారి పాలెం రోడ్డులో ఒక నెట్‌వర్క్‌కు సంబంధించి టవర్‌ను నిర్మిస్తున్నారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– నందిరాజు తోట గ్రామ ప్రజలు

నకిలీ ఓట్లపై దృష్టి సారించాలి

ఎమ్మెల్సీ ఎన్నికపై ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనన్ వీడియో కాన్ఫరెన్స్

బాపట్ల: శాసన మండలి ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓట్లను జిల్లా ఎన్నికల అధికారులు సత్వరమే విచారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనన్ ఆదేశించారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓట్లు, ఒకే వ్యక్తి పేరు జాబితాలో రెండుచోట్ల నమోదైతే వాటిని విచారించి తొలగించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయాలన్నారు. అలాగే బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటర్లను ఎంపిక చేయాలన్నారు. బ్యాలెట్ పత్రాలు పింక్ కలర్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 23వ తేదీన అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా హైకోర్టు కేసుల్లో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత దస్త్రాల పునఃపరిశీలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల సర్వీస్ సర్టిఫికెట్ల జారీపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

డూప్లికేట్ ఓట్లపై విచారణ చేస్తున్నాం..

బాపట్ల జిల్లాలో డూప్లికేట్ ఓటర్లను గుర్తించి విచారణ చేపడుతున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధ్యాయ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఒకటి డబుల్ ఎంట్రీ కాగా, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించిన జాబితాలో ముగ్గురికి వయస్సు అధికంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. సమావేశంలో జిల్లా నుంచి డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.

పోతుల సునీత హ్యాట్రిక్

- బీసీ కోటాలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఖరారు
- 2017, 2021లో ఎమ్మెల్సీగా విజయం
- ప్రస్తుతం పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు
- మహిళా సాధికారతకు పెద్దపీట
- చేతల ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్

చీరాల: ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత ఎంపిక య్యారు. దీంతో ఆమె వరుసగా మూడోసారి ఎమ్మెల్సీ పదవిని దక్కించుకోనున్నారు. బీసీ (పద్మశాలి) సామాజికవర్గానికి చెందిన పోతుల సునీత బాపట్ల జిల్లా చీరాలలో నివాసముంటున్నారు. 2017లో సునీత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. పదవీకాలం మరో మూడేళ్లు ఉండగానే ఆమె పదవికి రాజీనామా చేశారు. 2021 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమెకు ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా స్థానం కల్పించారు. ప్రస్తుతం 2023 మార్చితో ఆమె ఎమ్మెల్సీ గడువు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యే కోటా నుంచి ఆమెకు ఎమ్మెల్సీ స్థానం కల్పించారు. అదే విధంగా పద్మశాలి సామాజికవర్గానికి చెందిన పోతుల సునీతను పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించి ఆమెకు మరిన్ని బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన పోతుల సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారన్నారు. స్థానిక సంస్థల్లోనూ బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ మాటల ప్రభుత్వం కాకుండా చేతల ప్రభుత్వంగా ముఖ్యమంత్రి నిరూపించారన్నారు.

బీసీలకు అందించిన సామాజిక న్యాయం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈరోజు ఇంతమందికి పదవులు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. బీసీలకు చేసిన న్యాయాన్ని అందరూ గుర్తించాలన్నారు. బీసీలందరూ కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజార్టీని కట్టబెట్టి ముఖ్యమంత్రి స్థానంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉంచేలా అందరూ కృషి చేయాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధన సీఎం చేతల్లో చూపిస్తున్నారని, అందుకు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక నిదర్శనమన్నారు.

ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలి : ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్లటౌన్: ఫిర్యాదుదారులతో సహృదయ భావనతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను స్వయంగా ఎస్పీకు విన్నవించుకున్నారు. ప్రతి పిటీషనర్‌తో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కారం చూపేలా సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎంతో బాధతో వారి సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయాలకు వస్తుంటారన్నారు. వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు, ఇతర సమస్యల గురించి 34 అర్జీలు అందాయి.

కనుల పండువగా రథోత్సవం

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. తొలుత అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం భ్రమరాంబ స్కంధ మాతగా భక్తులను అనుగ్రహించారు. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, హారతులతో పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా నివేదన నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు దివ్య రథాన్ని శోభాయమానంగా అలంకరించి, భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని ఆశీనులు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. కేరళ వాయిద్యాలు, మహిళల కోలాట భజనలతో విద్యుత్ కాంతుల నడుమ రథోత్సవం పెదకాకాని పురవీధుల్లో సాగింది. భ్రమరాంబమల్లేశ్వరస్వామికి భక్తులు దారి పొడవునా స్వాగతం పలికారు. కొబ్బరికాయలు, పూజ సామగ్రి సమర్పించారు. రథాన్ని లాగేందుకు యువతీ యువకులు, భక్తులు పోటీ పడ్డారు. బాణసంచా వెలుతురులో రథోత్సవం వైభవంగా జరిగింది.

23న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


పి.వి.జె.రామారావు, జిల్లా విద్యా శాఖ అధికారి

బాపట్లఅర్బన్: జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 23న బాపట్ల పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల నుంచి పర్యావరణహిత పదార్థాలు, ఆరోగ్యం-పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ యాప్, పర్యావరణ వాతావరణ మార్పులు, గణిత నమూనాలు ఐదు అంశాలతో ఒక్కొక్కటి చొప్పున ఎంపికైన ప్రాజెక్టులు ప్రదర్శిస్తారన్నారు. 25 మండలాల నుంచి మొత్తం 125 ప్రాజెక్టులు ప్రదర్శనకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని తొమ్మిది అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుంచి కూడా 18 ప్రాజెక్టులు ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రదర్శన నుంచి ఒక్కొక్క ఉప అంశం నుంచి రెండు చొప్పున మొత్తం పది ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయబడతాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 17,439 మంది విద్యార్థులు ఏప్రిల్ 2023లో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ విద్యార్థులకు 103 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంచి ఫలితాల సాధన కోసం జనవరి 19 నుంచి విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం4.15 నుంచి 5.15 వరకు వేర్వేరు సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బాపట్ల ఉప విద్యాశాఖ అధికారి జి.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ పాల్గొన్నారు.

అంతర జిల్లాల దొంగ అరెస్టు

● రూ.10 లక్షల విలువైన 6 ట్రాక్టర్ ట్రాలీలు, 2 ట్రాక్టర్ ఇంజిన్‌లు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన మార్టూరు సీఐ షేక్ ఫిరోజ్


దొంగతనం వివరాలను వివరిస్తున్న సీఐ ఫిరోజ్, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది


నిందితులు దొంగిలించిన ట్రాలీలు, ట్రాక్టర్‌ల ఇంజన్‌లు

పర్చూరు: ట్రాక్టర్ ట్రాలీలు, ట్రాక్టర్ ఇంజిన్‌లు దొంగిలించిన ఇద్దరిని గుర్తించిన పర్చూరు పోలీసులు వారిలో ఒకరిని అరెస్ట్ చేశారు. మార్టూరు సీఐ షేక్ టీ ఫిరోజ్ తెలిపిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఇంజం వెంకట రామాంజనేయరెడ్డి మరో వ్యక్తి వెంకటరెడ్డితో కలిసి ట్రాక్టర్ ట్రాలీలు దొంగిలించే వారు. ఇందులో భాగంగా ఇద్దరూ కలిసి పగటి సమయంలో ట్రాక్టర్ ట్రాలీల కోసం రెక్కీ నిర్వహిస్తుంటారు. రైతులు వారి పొలాల్లో, కొష్టాల్లో, నివాస సమీపంలో నిలిపి భద్రత లేకుండా ఉన్న ట్రాలీలను లక్ష్యంగా చేసుకునేవారు. ఎవరికీ అనుమానం రాకుండా సులువుగా తీసుకొని వెళ్లేందుకు అవకాశం ఉన్న ట్రాలీలను ఎంపిక చేసుకొని రాత్రి సమయాల్లో వెంకట రామాంజనేయరెడ్డి ట్రాక్టర్ ఇంజిన్‌ను తీసుకొని దొంగతనం చేస్తుంటారు. ట్రాలీలను తెలిసిన వ్యక్తుల దగ్గరకు వెళ్లి మా గ్రామానికి చెందిన రైతులు అప్పుల్లో ఉన్నారని, అతనికి ట్రాలీ అమ్మి పెట్టమన్నాడని నమ్మించి అమ్ముకొని వచ్చిన డబ్బులతో ఇద్దరు జల్సా చేస్తుంటారని తెలిపారు.

ఇలా పట్టుకున్నారు..

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఏ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మార్టూరు సీఐ, ఎస్సై ఎన్‌సీ ప్రసాద్ తన సిబ్బందితో ట్రాక్టర్ ట్రాలీల దొంగతనం చేసిన వ్యక్తుల కోసం గాలింపు ప్రారంభించారు. ఇందులో భాగంగా 20వ తేదీ సోమవారం ఎస్సైకు అందిన సమాచారం మేరకు పర్చూరు వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిందితుడు ఇంజం వెంకట రామాంజనేయరెడ్డి తన దగ్గరున్న ట్రాక్టర్‌ను చిలకలూరిపేట నుంచి పర్చూరు వైపు తీసుకొని వస్తూ పోలీసులను చూసి వెనుకకు వెళ్లడానికి ప్రయత్నించాడు. అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా స్నేహితుడు వెంకటరెడ్డితో కలిసి చేసిన నేరాలను అంగీకరించాడు. మార్కాపురం రూరల్, పర్చూరు, యద్దనపూడి, తాడివారిపల్లి, అర్ధవీడు, కంభం, కురిచేడు పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 6 ట్రాక్టర్ ట్రాలీలు, 2 ట్రాక్టర్ ఇంజన్లను దొంగిలించినట్లు అంగీకరించాడు. దాంతో పోలీసులు ట్రాలీలు, ట్రాక్టర్ ఇంజిన్‌లు మొత్తం రూ.10 లక్షలు విలువ చేసే వాటిని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేశారు.

పోలీసులను అభినందించిన ఉన్నతాధికారులు

ట్రాక్టర్ ట్రాలీల దొంగతనం కేసులలో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి వాహనాలు స్వాధీనం చేసుకొని ప్రతిభ కనబరచిన మార్టూరు సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. వీరితో పాటు ఏఎస్ఐలు పీ కోటేశ్వరరావు, ఎస్ సురేష్‌రెడ్డి, కానిస్టేబుల్‌లు ఎం బాలశంకరరావు, ఎం కిరణ్‌కుమార్, ఎన్ మురళిలు అభినందించిన వారిలో ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రాచపూడి విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న గ్రామస్తులు

మేదరమెట్ల: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో మార్చి 3నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న 40వ జాతీయస్థాయి బాల్ షూటింగ్ పోటీలకు మండలంలోని రాచపూడికి చెందిన విద్యార్థి దేవరకొండ హనుమాన్ ఎంపికయ్యాడు. ఈ మేరకు బాపట్ల జిల్లా షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర సోమవారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు హనుమాన్‌జంక్షన్‌లోని బడుగుపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. షూటింగ్ బాల్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొనుండగా, బాపట్ల జిల్లా నుంచి దేవరకొండ హనుమాన్ పోటీలకు అర్హత సాధించాడు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు వీరగంధం పాండురంగారావు, హనుమంతరావు, గ్రామస్తులు అభినందించారు.

అప్పికట్ల రథోత్సవంలో అపశృతి

రథం లాగుతూ మహిళ మృతి

బాపట్లటౌన్: మండలంలోని అప్పికట్ల గ్రామంలో జరిగిన రథోత్సవంలో మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన గెల్లి చాముండేశ్వరి(45) ఆదివారం రాత్రి అప్పికట్లలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగేందుకు ప్రయత్నించింది. రథం లాగుతుండగా జరిగిన తోపులాటలో కంగారు పడిన చాముండేశ్వరికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే పోలీస్ వాహనంలో పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాబ్ మేళా

గుంటూరుఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు బయోడేటా, విద్యార్హతలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో సాయంత్రం 4.00 వరకు జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావాలని తెలిపారు.

అవి ప్లాస్టిక్ బియ్యం కాదు

● సీఎస్‌డీటీ డి.రవీంద్రకుమార్
● ఇంటింటికి వెళ్లి బియ్యం పరిశీలన


భట్టిప్రోలులో రేషన్ కార్డుదారుల వద్ద ఉన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖాధికారులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిసి రావడంపై పౌరసరఫరాల శాఖ సోమవారం విచారణ చేపట్టింది. సీఎస్‌డీటీ డి.రవీంద్రకుమార్, రేపల్లె ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, టి.వెంకటేష్, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణలు భట్టిప్రోలులోని షాప్ నెంబర్-2 నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఆయా ప్రాంతాల్లో సరఫరా చేసిన గృహాలను సందర్శించారు. రేషన్ కార్డుదారుల వద్ద బియ్యాన్ని పరిశీలించి అవి ప్లాస్టిక్ బియ్యం కాదని పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యంగా నిర్ధారించారు. ఫిబ్రవరి నెల ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు ఈ బియ్యాన్ని సరఫరా చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డుదారులు ఎటువంటి అపోహలు పడవద్దని బియ్యాన్ని వినియోగించుకోవచ్చునని అధికారులు సూచించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌లో వృద్ధుడు మృతి

ఒంగోలుటౌన్: కుటుంబ వివాదంపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన ఏరువ గోవిందరెడ్డి(55) కుమార్తెతో కలిసి ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఫిర్యాదుల విభాగంలో పేరు నమోదు చేసుకున్న ఆయన కొద్దిసేపటికే ఆ పక్కనే ఉన్న కుర్చీలో కుప్పకూలాడు. వెంటనే ఆయన్ను పోలీసు వాహనంలో జీజీహెచ్‌కి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గోవిందరెడ్డి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

27న నిధి ఆప్కే నికత్

గుంటూరుఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ సోమ వారం తెలిపారు. ఈపీఎఫ్‌వోపై అవగాహన, అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు, వాటాదారులతో పరస్పర చర్చల్ని ఆరు జిల్లాల్లో ఒకే రోజున నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుంటూరు జిల్లా పరిధిలో మంగళగిరిలోని ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణాజిల్లా పరిధిలో గుడివాడలోని ఏఎన్నార్ కళాశాల, ప్రకాశం జిల్లా పరిధిలో చీమకుర్తి మండలం రామతీర్థంలోని ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్, ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విజయవాడ ఇబ్రహీంపట్నంలోని ఏపీజెన్‌కో సమావేశ మందిరం, బాపట్ల జిల్లా పరిధిలో ఏబీడీ శిక్షణ కేంద్రం, ఐటీసీ, చీరాల, పల్నాడు జిల్లా పరిధిలో చిలకలూరిపేటలోని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్‌లో సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

నదిలో వేటకు వెళ్లి వ్యక్తి మృతి


మృతుడు శ్రీనివాసరావు

రేపల్లెరూరల్: కృష్ణా నదిలో వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మోర్తోటలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ విజయ్‌చంద్ర కథనం ప్రకారం.. మోర్తోట గ్రామానికి చెందిన కారాని వెంకట శ్రీనివాసరావు(53) ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం కృష్ణానదిలో వేటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతని భార్య లక్ష్మి అదేరోజు రాత్రి గ్రామంలోని నది ఒడ్డున గాలించింది. వలలో చిక్కుకుని కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, శవపంచనామా అనంతరం సోమవారం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కోటప్పకొండ అభివృద్ధికి రూ.2కోట్ల నిధులు

విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: కోటప్పకొండ అభివృద్ధి కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ రూ.2కోట్ల నిధులు కేటాయించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తన ఆహ్వానాన్ని మన్నించి కుటుంబసభ్యులతో సహా త్రికోటేశ్వరుని దర్శనం చేసుకున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలియచేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ల సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించబడ్డాయన్నారు. తిరునాళ్లకు సుమారుగా 18లక్షల మంది వరకు భక్తులు తరలి వచ్చారన్నారు. త్రికోటేశ్వరుడిని దర్శించుకోవటంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కృషిచేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, ఆలయ అధికారులు, సహకరించిన భక్తులు, పోలీసు యంత్రాంగానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్రభ విరిగి పడిన ఘటనలో కార్మికుడు మృతి

రెంటచింతల: విద్యుత్ ప్రభ విరిగిపడి తీవ్రంగా గాయపడి గుంటూరు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు పేరుపోగు శ్యామ్‌కుమార్(23)సోమవారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్ఐ సయ్యద్ సమీర్‌బాషా తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన భక్తులు సత్రశాల దేవస్థానం ఆవరణలో శనివారం సాయంత్రం విద్యుత్ ప్రభను శ్యామ్‌కుమార్‌తో నిర్మిస్తున్నారు. ఈ సమయంలో ప్రభ మధ్యలోకి విరిగి పడడంతో శ్యామ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఏపీ జెన్‌కో అంబులెన్స్ వాహనంలో మాచర్ల ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నరసరావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకువెళ్లారు. గురజాల మండలం లోని గంగవరం గ్రామానికి చెందిన శ్యామ్‌కుమార్ అవివాహితుడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.